# ప్రత్యక్ష సాక్షి

తెలుగు దినపత్రిక

RNI No.APTEL/2011/38267



**విలేకరులు కావలెను**

ప్రత్యక్ష సాక్షి దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ ప్రాంతంలోని అన్ని జిల్లాలు మరియు నియోజకవర్గాల నుంచి పనిచేయుటకు విలేకరులు కావలెను. ప్రశ్నించే తత్వంతో పాటు నిజాన్ని నిర్భయంగా రాయగలిగే సత్తా ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి : సెల్ : 99892 88546



సంపుటి : 15 సంచిక : 292 బుధవారం 10-06-2026

ఎడిటర్ : కందుకూరి పరమేశ్వర్‌రావు, M.A. పేజీలు : 4 వెల : రూ2/-


## కష్టకాలంలో మనతో నడిచే వారే మనవారు..

### ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసన సభ్యులు దాస్యం





సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్

7, 10 డివిజన్ల బూత్ లెవల్ ఏజెంట్ ల సమావేశాన్ని, ఏడవ డివిజన్ అధ్యక్షులు కొండ శ్రీనివాస్, 10వ డివిజన్ అధ్యక్షులు ఎండి ఖలీల్ ఆధ్వర్యంలో పులి రజినీకాంత్ అధ్యక్షతన మంగళవారం రోజున కాపువాడలోని మాతా గార్డెన్ లో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుతం పార్టీ కోసం పని చేసే వారిని గుర్తించి రాబోవు రోజుల్లో రాష్ట్రంలో ఎవరు చేయని విధంగా వారికి అండగా ఉంటా. కార్యకర్తలను వేధిస్తే ఊరుకోను.కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా. పార్టీని మోసం చేసి పోయిన వారిని పట్టించు కోవద్దు. బీఆర్ఎస్ పార్టీ త్వరలో సభ్యత్వ నమోదు కార్యక్ర మాన్ని చేపట్టనుంది. పార్టీలోకి కొత్త రక్తం వస్తోంది, మరింత ఉత్సాహంగా పని చేద్దాం. ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియపై బూత్ లెవెల్ ఏజెంట్స్ అప్రమత్తంగా ఉండి ఓటరు మ్యాపింగ్ చేపట్టాలి

బూత్ స్థాయిలో ఓటర్లకు అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో పని చేయాలి.. నేను ఎప్పుడు ప్రజలతో ఉన్నా, ప్రజల కోసమే ఉ న్నా. డివిజన్ వారీగా స్థానిక సమస్యలపై చర్చించి, పరిష్కరించేందుకు కృషి చేయాలి.గడప గడప తిరుగుతా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాను. మనం చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెలుదాం. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజల్లో ఎండగడుదాం. ప్రజా సమస్యలపై పోరాడితే కార్యకర్తలపై, నాపై కేసులు నమోదు చేస్తున్నారు. కేసులు నాకు కొత్త కాదు.కాంగ్రెస్ అవినీతిని,పాలనా వైఫల్యా లను ప్రజల్లోకి తీసుకెలుదాం. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసింది.పార్టీ శ్రేణులకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను.. మళ్ళీ తెలంగాణ లో కేసీఆర్ పాలన తీసుకొచ్చేం దుకు పాటుపడుదాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉడుతల సారంగపాణి, సీనియర్ నాయకులు నాయీముద్దీన్, నాయకులు కొండ శ్రీనివాస్, ఎండి ఖలీల్, ఏరుకొండ హైమావతి, సుదర్శన్, ఈశ్వర్, పొదిలి అనిల్, వరుణ్, సుధాకర్, డివిజన్ ఇంచార్జ్ లు విజయ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు

## ఈనెల 13న బీజేపీ "స్వచ్ఛ పాఠశాల

### కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బండి సంజయ్ వినూత్న కార్యక్రమం

(ప్రత్యక్ష సాక్షి, కరీంనగర్)

కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. "స్వచ్ఛ పాఠశాల" పేరుతో తన పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజవర్గాల్లోని అన్ని గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత ప్రభుత్వ పాఠశాలలన్నింటిన్నీ పరిశుభ్రం చేయాలని నిర్ణయించారు. "స్వచ్ఛ పాఠశాల" పేరుతో ఈనెల 13న ఆయా పాఠశాలలన్నింటినీ పరిశుభ్రం చేయాలని పిలుపునిచ్చారు. ఈరోజు కరీంనగర్ లోని చైతన్యపురిలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని జిల్లాల అధ్యక్షులు, మండలాధ్యక్షులతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సమావేశమయ్యారు. మోదీ 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈనెల 15నుండి పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆయా ప్రభుత్వ పాఠశాలన్నింటినీ పరిశుభ్రం చేసి సుందరంగా ముస్తాబు చేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గంలో రేపు(10న) మండలాల వారీగా పార్టీ కార్యకర్తలంతా సమావేశమై ఒక్కో పాఠశాల వారీగా ఇంచార్జీలను నియమించాలని సూచించారు.

ఈనెల 11, 12 తేదీల్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు గ్రామాలకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో "టిఫిన్ బైఠక్" పేరుతో సమావేశం నిర్వహించాలని పిలుపునిచ్చారు. "ప్రతి స్కూల్ లోని ఎన్ని తరగతి గదులుంటాయో, ఒక్కో గదికి ఇద్దరు చొప్పున కార్యకర్తలను కేటాయించాలి. ఈనెల 13న అన్ని పాఠశాలల్లోని అన్ని తరగతి గదులను శుభ్రం చేయించాలి. అవసరమైతే చీపురు, క్లాత్ వంటి వస్తువులను తీసుకెళ్లాలి. క్లాస్ రూంలను శుభ్రం చేయడంతోపాటు ఆయా పాఠశాలలను సుందరంగా ముస్తాబు చేయాలి. స్కూల్ ను క్లీన్ చేయడం ద్వారా ఒక మంచి వాతావరణం కల్పించాలి. ఫేస్



బుక్, ట్విట్టర్, ఇన్ స్టా గ్రాం వంటి సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలి" అని కోరారు. దీంతోపాటు ఈనెల ప్రతి గ్రామంలో "మీ పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి" అనే నినాదంతో ఊరూవాడా ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

ఈ ఏడాది కూడా ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ చదివే విద్యార్థులకు మోదీ గిఫ్ట్ పేరుతో ఉచితంగా బ్రాండెడ్ సైకిల్ ను అందజేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. "ఇదే విషయాన్ని ఊరూవాడా చెబుతూ ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ చదువుకునే ప్రతి ఒక్కరికి ఉచితంగా బ్రాండెడ్ సైకిల్ అందిస్తామని చెప్పండి. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి రికార్డు స్థాయిలో ఒకేసారి ఒకే టైంలో అన్ని ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులందరికీ సైకిళ్లను పంపిణీ చేద్దాం. అవసరమైతే గిన్నిస్ బుక్ రికార్డులో నమోదయ్యేలా క్రుషి చేద్దాం. తద్వారా ప్రజల్లోకి మంచి సందేశాన్ని పంపుతాం."అని పేర్కొన్నారు.

**రేపు మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు..** మరోవైపు 12 ఏళ్ల మోదీ పాలనను పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ రేపు ఉదయం కరీంనగర్ మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

## ఎల్లమ్మ దేవాలయ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్..

(ప్రత్యక్ష సాక్షి, కరీంనగర్)

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 4వ డివిజన్ దుర్శేడ్ శివారులో గల ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల ఉ త్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజల సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు అనంతరం మల్లన్న దేవాలయం నుండి ఎల్లమ్మ దేవాలయం వరకు ఏర్పాటు చేసిన నూతన స్ట్రీట్ లైట్లను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే నగరపాలక సంస్థ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ కార్పొరేటర్ భూపతి రవీందర్, స్థానిక



నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు మరియు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

2లో

## పౌర హక్కుల కోసం పరితపించిన మేధావి బాల గోపాల్

### జూన్ 10.. పౌర హక్కుల పోరాట యోధుని జయంతి

## భారత రాజకీయ గగనంలో మోదీ మరో శిఖరం

### నెహ్రూను అధిగమించిన మోదీ: ప్రజాస్వామ్య చరిత్రలో కొత్త అధ్యాయం



భారత ప్రజాస్వామ్య చరిత్రలో కొన్ని ఘట్టాలు కేవలం రాజకీయ సంఘటనలుగానే కాకుండా చరిత్ర పుటల్లో శాశ్వత ముద్ర వేసే మైలురాళ్లుగా నిలుస్తాయి. అలాంటి అరుదైన ఘట్టాల్లో ఒకటి నరేంద్ర మోదీ సాధించిన సుదీర్ఘ ప్రధానమంత్రి పదవీకాల రికార్డు. 2014 మే 26న భారతదేశ 15వ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్ర మోదీ, 2026 జూన్ 10 నాటికి వరుసగా 4,399 రోజులపాటు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానమంత్రిగా కొనసాగి, స్వతంత్ర భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 4,398 రోజుల ఎన్నికైన ప్రధానమంత్రి పదవీకాల రికార్డును అధిగమించ గలగడం సామాన్య విషయం కాదు. ఇది కేవలం ఒక నాయకుడి వ్యక్తిగత రాజకీయ విజయగాథ మాత్రమే కాదు; భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల తీర్పు ఎంత శక్తివంతమైనదో, నాయకత్వ స్థిరత్వం ఎంత ప్రాధాన్యమైనదో చాటిచెప్పే చారిత్రక ఘట్టం.

1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిన రోజున భారతదేశపు తొలి ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర్యానంతర భారత నిర్మాణానికి పునాదులు వేసిన నాయకుడిగా ఆయనకు చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది. అయితే 1952లో జరిగిన తొలి సాధారణ ఎన్నికల తర్వాత ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రధానమంత్రిగా ఆయన కొత్త ప్రజాస్వామ్య వ్యవస్థకు నాయకత్వం వహించారు. 1952, 1957, 1962 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించి దేశాన్ని దాదాపు పదిహేడేళ్ల పాటు నడిపించారు. ఆధునిక భారత నిర్మాణ శిల్పిగా పేరుపొందిన నెహ్రూ, భారీ పరిశ్రమలు, ఆనకట్టలు, శాస్త్రసాంకేతిక పరిశోధన సంస్థలు, ప్రజాస్వామ్య వ్యవస్థలు, విదేశాంగ విధానానికి పునాదులు వేశారు. ఆయన నాయకత్వం భారత రాజకీయ చరిత్రలో ఒక యుగంగా నిలిచింది.

అలాంటి నాయకుడి ఎన్నికల ఆధారిత నిరంతర పదవీకాల రికార్డును అధిగమించడం అనేది సాధారణ విషయం కాదు. నరేంద్ర మోదీ రాజకీయ ప్రయాణం కూడా అసాధారణమే. గుజరాత్ ముఖ్యమంత్రిగా దాదాపు పదమూడు సంవత్సరాలు పరిపాలన సాగించిన ఆయన, 2014లో భారతీయ జనతా పార్టీని చారిత్రక విజయానికి నడిపించారు. 1984 తర్వాత తొలిసారిగా ఒకే పార్టీ స్వయంగా సంపూర్ణ మెజారిటీ సాధించడం భారత రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. 543 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ 282 స్థానాలు గెలుచుకోవడం ద్వారా దేశ రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. అవినీతి ఆరోపణలు, పరిపాలనా స్థబ్దత, ఆర్థిక మందగమనం వంటి అంశాల నేపథ్యంలో ప్రజలు మార్పును కోరుకుంటున్న సమయంలో మోదీ నాయకత్వం జాతీయ స్థాయిలో ఆమోదం పొందింది.

2019లో జరిగిన 17వ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మరింత బలపడింది. ఏకంగా 303 స్థానాలు గెలుచుకొని మరోసారి అధికారంలోకి వచ్చింది. స్వాతంత్ర్యం తర్వాత ఇందిరాగాంధీ కాలం తరువాత ఒక నాయకుడు మరింత బలమైన ప్రజా మద్దతుతో తిరిగి అధికారంలోకి రావడం ఇదే మొదటిసారి. 2024లో జరిగిన 18వ లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకుంది. ఈ విజయంతో నెహ్రూ తర్వాత వరుసగా మూడు సాధారణ ఎన్నికల్లో ప్రజల తీర్పుతో ప్రధానమంత్రి పదవిని కొనసాగించిన రెండో నాయకుడిగా మోదీ చరిత్ర సృష్టించారు. కాంగ్రెసేతర రాజకీయ పార్టీకి చెందిన నాయకుడిగా ఈ ఘనత సాధించిన ఏకైక వ్యక్తిగా కూడా ఆయన నిలిచారు. మోదీ పదవీకాలాన్ని పరిశీలిస్తే భారత రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో పలు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. 2014లో ప్రారంభమైన జనధన్ యోజన ద్వారా కోట్లాది మంది బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చారు. 2016లో ప్రకటించిన నోట్ల రద్దు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నల్లధనం, నకిలీ కరెన్సీ, ఉగ్రవాద నిధులపై పోరాటంగా ప్రభుత్వం దీన్ని పేర్కొంది. అయితే దీని ప్రభావంపై ఆర్థిక నిపుణుల మధ్య ఇప్పటికీ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. 2017లో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలు ద్వారా దేశవ్యాప్తంగా ఏకీకృత పన్ను వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. స్వాతంత్ర్యం తర్వాత అత్యంత పెద్ద ఆర్థిక సంస్కరణగా దీనిని అభివర్ణించారు.

2019లో జమ్మూ-కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు చారిత్రక రాజకీయ నిర్ణయంగా నిలిచింది. దేశ సమగ్రతను బలోపేతం చేయడానికే ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించగా, ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రశ్నలు లేవనెత్తాయి. అదే ఏడాది పౌరసత్వ సవరణ చట్టం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. 2020లో కరోనా మహమ్మారి సమయంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఉచిత టీకా కార్యక్రమాన్ని అమలు చేయడం కూడా మోదీ ప్రభుత్వ ప్రధాన విజయాల్లో ఒకటిగా పేర్కొనబడుతోంది. 220 కోట్లకు పైగా వ్యాక్సిన్ డోసులు అందించడం ద్వారా భారతదేశం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

అంతర్జాతీయ వేదికలపై భారతదేశ ప్రతిష్ఠ పెరగడంలో కూడా మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషించింది. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, యూరోపియన్ దేశాలతో వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేశారు. జీ-20 సదస్సుకు భారత్ అధ్యక్షత వహించడం, గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకగా భారత్ ఎదగడం, అంతరిక్ష రంగంలో చంద్రయాన్-3 విజయవంతంగా చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో దిగడం, ఆదిత్య-ఎల్1 ప్రయోగం విజయవంతం కావడం వంటి ఘట్టాలు భారత ప్రతిష్ఠను పెంచాయి. డిజిటల్ ఇండియా కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేశారు. యూపీఐ చెల్లింపుల వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది.

సంక్షేమ రంగంలో ఉజ్వల యోజన ద్వారా కోట్లాది కుటుంబాలకు ఉచిత వంటగ్యాస్ కనెక్షన్లు అందించబడ్డాయి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద లక్షలాది గృహాలు నిర్మించబడ్డాయి. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా పారిశుధ్య ఉద్యమం చేపట్టబడింది. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి కనెక్షన్లు అందించడంపై దృష్టి సారించారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా పేదలకు ఆరోగ్య బీమా సదుపాయాలు కల్పించారు. అయితే ప్రతి సుదీర్ఘ పాలనలాగే మోదీ పాలన కూడా విమర్శలకు అతీతం కాలేదు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం, చిన్న పరిశ్రమలపై ఆర్థిక సంస్కరణల ప్రభావం, సామాజిక ఉద్రిక్తతలు, మీడియా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రత వంటి అంశాలపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. రైతు ఉ ద్యమాలు, మణిపూర్ హింస, కొన్ని రాష్ట్రాల్లో రాజకీయ ఉద్రిక్తతలు ప్రభుత్వానికి సవాళ్లుగా మారాయి. ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రశంసలు రెండూ సహజమైనవే. వాటి మధ్య ప్రజా మద్దతును నిలబెట్టుకోవడం నాయకత్వ సామర్థ్యానికి సూచికగా భావించ బడుతుంది. భారత ప్రధానమంత్రుల చరిత్రను పరిశీలిస్తే జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, నరేంద్ర మోదీ, మన్మోహన్ సింగ్ వంటి నాయకులు దీర్ఘకాలం దేశాన్ని నడిపించారు. అయితే వరుసగా మూడు ఎన్నికల్లో ప్రజల తీర్పుతో అధికారాన్ని నిలబెట్టుకొని, నెహ్రూ ఎన్నికల ఆధారిత నిరంతర పదవీకాల రికార్డును అధిగమించడం ద్వారా నరేంద్ర మోదీ భారత రాజకీయ చరిత్రలో ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించారు. ఇది వ్యక్తిగత రాజకీయ విజయం మాత్రమే కాదు; ప్రజలతో నిరంతర అనుబంధం, ఎన్నికల ద్వారా లభించిన ప్రజా మద్దతు, నాయకత్వ స్థిరత్వానికి ప్రతీక. స్వాతంత్ర్య భారత ప్రజాస్వామ్య ప్రయాణంలో నెహ్రూ ఒక యుగానికి ప్రతినిధి అయితే, 21వ శతాబ్దపు భారత రాజకీయాల్లో మోదీ ఒక ప్రభావవంతమైన అధ్యాయానికి ప్రతీకగా నిలిచారు. ఈ రికార్డు భవిష్యత్తులో మరెంతకాలం కొనసాగుతుందో ప్రజల తీర్పే నిర్ణయిస్తుంది. అయితే 2026 జూన్‌లో నమోదైన ఈ మైలురాయి భారత ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.


రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్, 9440595494


## పర్యావరణ ఉల్లంఘనలకు కిరాయిదారే బాధ్యుడు : సుప్రీంకోర్టు

(ఢిల్లీ)

అద్దెకు తీసుకున్న స్థలంలో జరిగే పర్యావరణ ఉల్లంఘనలకు కిరాయిదారే బాధ్యత వహించాల్సి ఉంటుందని, స్థల యజమానికి జరిమానా విధించడం సరికాదని సుప్రీంకోర్టు పేర్కొంది. జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) వెలువరించిన తీర్పును సమర్థిస్తూ జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ ధర్మాసనం ఈ విషయం వెల్లడించింది.

సూరత్‌కు చెందిన భూ యజమాని స్థలంలో కిరాయిదారు రసాయన పరిశ్రమను నెలకొల్పారు. ఈ పరిశ్రమ నుంచి నిర్దేశిత పరిమితిని మించి కాలుష్యం వెలువడటంతో రూ.25లక్షల పరిహారం చెల్లించాలంటూ భూయజమానికి గుజరాత్ కాలుష్య నియంత్రణ మండలి (జీపీసీబీ) నోటీసు జారీ చేసింది. దీనిని స్థలయజమాని ఎన్‌జీటీలో సవాల్ చేయగా...రసాయన పరిశ్రమ నిర్వహిస్తోన్న కిరాయిదారే బాధ్యుడని తీర్పు వెలువడింది. జీపీసీబీ దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఎన్‌జీటీ నిర్ణయాన్నే ధర్మాసనం సమర్థించింది.

# పౌర హక్కుల కోసం పరితపించిన మేధావి బాల గోపాల్

## జూన్ 10.. పౌర హక్కుల పోరాట యోధుని జయంతి



పౌరహక్కుల ఉద్యమానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన ఘనత బాలగోపాల్ కే దక్కుతుంది. బాలగోపాల్ ఒక మధ్యతరగతి తెలుగు బ్రాహ్మణ దంపతుల ఎనిమిది మంది పిల్లలలో ఐదవ సంతానం– కందాళ్ళ పార్థనాథ శర్మ మరియు రాళ్ళపల్లి నాగమణి దంపతులకు బాలగోపాల్ 1952, జూన్ 10న బళ్ళారి, కర్ణాటకలో జన్మించాడు. ఆయన సోదరులలో ఒకరైన అనంత భారత సైన్యంలో డాక్టర్. . మాతామహుడు: ప్రముఖ సాహితీవేత్త రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ. ఈటీవీ2లో చాలాకాలం తెలుగు వెలుగు కార్యక్రమానికి నిర్వాహకురాలు గా ఉన్న మృణాళిని సోదరి. ఒకటి నుంచి డిగ్రీ వరకు తిరుపతిలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి, వరంగల్ లోని ఆర్ఈసీ నుంచి గణితంలో పీహెచ్‌డీ, 1980లో కాకతీయ విశ్వ విద్యాలయంలో గణిత అధ్యాకు డిగా ఉద్యోగంలో చేరిక, 1985లో ఉద్యోగానికి రాజీనామా, అప్పటి నుంచి హక్కుల ఉద్యమానికే పూర్తిగా అంకితం అయ్యాడు. మూడు దశాబ్దాలుగా అవిశ్రాంత కృషి సలిపిన ప్రముఖ హక్కుల నేత, న్యాయవాది, హేతువాది మేధావి. హైదరాబాద్ లోని గుడిమల్కాపూర్ ప్రియా కాలనీలో నివసించాడు. ఆయన భార్య వసంత లక్ష్మి ఆంధ్రజ్యోతిలో పాత్రికేయురాలు. వారికి ప్రభాత అనే కుమారుడు కలిగాడు. మానవతా విలువల కోసం పోరు సల్పుతు, ఆదివాసీ ఉద్యమం నుంచి విప్లవోద్యమం వరకు, పౌరహక్కుల ఉద్యమం నుంచి మానవ హక్కులు ఉద్యమం వరకు, కూలీ పోరాటం నుంచి భూపోరాటం వరకు అన్నిరకాల ఉద్యమాలతో పెనవేసుకు పోయిన నాయకు డాయన.

ఎక్కడ అన్యాయం, వివక్ష, అణిచివేత, అసమానతలు కనిపించినా నిష్కర్షగా, నిక్కచ్చిగా, నిర్భయంగా పోరాడాడు. ఈ క్రమంలో వచ్చిన బెదిరింపుల్ని ఏనాడూ లెక్కచేయలేదు. ఆయనపై ఎన్నోసార్లు భౌతిక దాడులు జరిగినా రెట్టించిన ఉత్సాహంతో పనిచేశాడు. బూటకపు ఎన్‌కౌంటర్లను వెలుగు లోకి తేవడంతో పోలీసులు ఆయనపై నక్సలైట్‌గా ముద్ర వేశారు. కొత్తగూడెంలో ఓసారి ఆయనపై దాడికి పాల్పడిన పోలీసులు చనిపోయాడని భావించి, మురికి కాల్వలో పడేసి వెళ్లగా పీడీఎస్‌యూ కార్యకర్తలు ఆయన్ను కాపాడారు. ఆయన మానవ హక్కుల ఉద్యమంతో పూర్తిగా సంబంధం కలిగి ఉన్న తరువాత చాలా కాలం తరువాత న్యాయవాదిగా మారడానికి ఎంచు కున్నాడు. బాలగోపాల్ 1983 మరియు 1997 మధ్య ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ (ఎపిసిఎల్సి) ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు. ఎపిసిఎల్‌సి లో అభిప్రాయ భేదాల తరువాత, అతను ఎపిసిఎల్‌సిని వదిలి మానవ హక్కుల ఫోరంను ఏర్పాటు చేశాడు.

26 సంవత్సరాల కాలంలో, అతను ఆంధ్రప్రదేశ్ మరియు ఇతర ప్రాంతాలలో ప్రభుత్వ దళాలు వేలాది మంది చట్టవిరుద్ధ హత్యల కేసులను నమోదు చేశాడు. 1980 ల చివరలో మావోయిస్టులు చేసిన కిడ్నాప్ వరుస సందర్భంగా, అప్రమత్తమైన సంస్థ ప్రజా బంధు ( ఫ్రెండ్స్ ఆఫ్ ది పీపుల్ ) ఆయనను అపహరించి, ఇద్దరు పోలీసు అధికారులను నక్సలైట్ కస్టడీ నుండి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసుల తో సంబంధాలున్నాయని అనుమానించిన ఈ సంస్థ, అపహరణకు గురైన పోలీసులను తిరిగి ఇచ్చిన తర్వాతే ఆయనను విడుదల చేసింది. బాలగోపాల్ 90 దశక ప్రారంభం వరకు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రచురించిన అనేక వ్యాసాలలో మాండలిక మార్క్సిస్ట్ పద్ధతిని అనుసరించాడు. సోవియట్ యూనియన్ పతనంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలగోపాల్ సమాధానాల కోసం మార్క్సిజంలో మానవతావాద సంప్రదాయాలను అన్వేషించడం ప్రారంభించాడు. 90 వ దశకంలో ఆయన వ్యాసాలు ఈ మార్పును ప్రతిబింబిస్తాయి. రాజ్య హింస తోపాటు ప్రైవేటు హింసను ఆయన వ్యతిరేకించాడు. నక్సల్బరీ ఉద్యమానికి ఎంతోమంది కార్యకర్తలను అందించిన ఆయన ఆ తర్వాత క్రమంలో విప్లవపార్టీల వైఖరిని తప్పుబట్టారు. ప్రజలకు చేరువకావడంలో ఎం.ఎల్ పార్టీలు విఫలమయ్యాయని విమర్శిం చారు. ఆయన రాసిన 'నక్సల్బరీ ఉద్యమం, గమ్యం, గమనం', 'చీకటి కోణం' పుస్తకాలు సంచలనం సృష్టించాయి.

మావోయిస్టుల హింస చర్యలపై ఆయన బహిరంగంగా విమర్శిం చడం నక్సలైట్ల నుండి తీవ్ర విమర్శలను ఆకర్షించింది. పశ్చిమ బెంగాల్‌లోని లాల్ ఘడ్ లో జరిగిన హింసపై ఆయన చేసిన వ్యాఖ్యల తరువాత, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల కోటేశ్వర్ రావు... బాలగోపాల్‌ను లాల్ గఢ్ నిరోధక ప్రాంతాన్ని సందర్శించి నిజమైన చిత్రాన్ని తెలుసుకోవాలని సవాలు చేశాడు. ఆయన 2008 లో భారతదేశ ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి సవాళ్ళపై నిపుణుల సమూహంలో సభ్యుడిగా పనిచేశాడు. మానవ హక్కులు అవిభక్త మైనవని ఆయన నమ్మాడు. అతను తన సరళమైన జీవనానికి మరియు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో క్రమం తప్పకుండా కనిపించే విశ్లేషణాత్మక వ్యాసాలకు ప్రసిద్ధి చెందాడు. ఇపిడబ్ల్యులోని అతని కథనాలలో ఇందిరా గాంధీ పాలన, రిజర్వేషన్ల సమస్య, వివిధ ప్రదేశాలలో ఎప్పటికప్పుడు మానవ హక్కుల ఉల్లంఘన, గుజరాత్ అల్లర్లు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, భూసేకరణ, ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ, వైయస్ఆర్ ప్రభుత్వం మరియు సిపిఐ–మావోయిస్టుల మధ్య చర్చలు తదితరాలతో ఆయన పాత్ర విడదీయరానిది. రాడికల్ విప్లవం కోసం తాము కృషి చేస్తున్నామని చెప్పుకునే వారి మానవ హక్కుల ఉల్లంఘనను ఆయన తెలుగు వ్యాసం 'చీకటి కోణాలు' లో ప్రత్యక్షంగా ప్రశ్నించారు. మానవ హక్కుల ఫోరం ఏర్పడిన తరువాత, అతను తన కార్య కలాపాలను విస్తరిం చాడు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ మరియు ఒరిస్సాలో తీవ్రమైన సామాజిక గందరగోళానికి గురైన ప్రాంతాలను సందర్శించాడు. ఒరిస్సాలో అతని నిజనిర్ధారణ బృందాలు రాయగడ జిల్లాను సందర్శించాయి. ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీల పనితీరులో ఉన్న వంచనను ఆయన విశ్లేషించాడు, బహిర్గతం చేశాడు. బాల గోపాల్ దాదాపు ఒక దశాబ్దం క్రితం న్యాయశాస్త్రం అభ్యసించడం ప్రారంభించాడు. పోలీసులు హత్యలను ఎదుర్కో వటానికి సంబంధించిన డజన్ల కొద్దీ కేసులను వాదించాడు. ఎన్‌కౌంట ర్లలో పాల్గొన్న పోలీసులపైన హత్యానేరం నమోదు చేయాలని ఆయన గట్టిగా వాదించి విజయం సాధించాడు. ఈ రాష్ట్రంలో ఆయన అడుగుపెట్టని పల్లె లేదు, పట్టణం లేదు. అరణ్యాల నుంచి జనారణ్యాల వరకూ ఎక్కడ ఏ సమస్య తలెత్తినా ఆయన తప్పని సరిగా ఆ ప్రాంతానికి వెళ్లి అధ్యయనం చేసేవాడు. అందుకే మన భౌగోళిక, నైసర్గిక స్థితిగతులపై ఆయనకున్న జ్ఞానం అపారం. ఆయన అక్టోబర్ 8, 2009 రాత్రి హైదరాబాద్ లోని బంజారా హిల్స్ లో గుండెపోటుతో మరణించాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్, 9440595494

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి..

## సుల్తానాబాద్ మండల వ్యవసాయ శాఖ అధికారి పైడితల్లి

ప్రత్యక్ష సాక్షి, సుల్తానాబాద్

వాన కాలం సాగుకు సరిపడా నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచి రైతులకు అందజేయాలని వ్యవసాయ శాఖ అధికారి పైడితల్లి తెలిపారు , మంగళవారం సుల్తానాబాద్ మండలం కట్నపల్లి రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి ఈ. పైడితల్లి ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండలంలోని ఫెర్టిలైజర్ డీలర్స్ మరియు సొసైటీ సీఈవో లతో సమావేశం పెట్టడం జరిగింది. ఇందులో భాగంగా డీలర్స్ కి సూచనలను చేయడం జరిగింది, ప్రతి డీలర్ తప్పనిసరిగా విత్తనాలు, ఎరువులు మరియు పురుగు మందుల లైసెన్సు కాపీలను, స్టాక్ బోర్డు ను విధిగా షాప్ వద్ద ప్రదర్శించాలని,విత్తనాలు అమ్మినపుడు తప్పనిసరిగా రైతుకు బిల్లు అందజేయాలని,వానాకాలం సాగుకు సరిపడ నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండాలని తెలియజేశారు. గత సంవత్సరం లాగానే ఈ సీజన్ కూడా ఫెర్టిలైజర్ బుకింగ్ అప్ లో యూరియా బుక్ చేసుకున్న రైతులకు మాత్రమే ఈ పి ఓ ఎస్ లో ఎంటర్ చేసి యూరియా అమ్మాలి. అమ్మిన తర్వాత



స్టాక్ రిజిస్టర్లో ఎంట్రీ చేయాలి మరియు రసీదు ఇవ్వాలి అని సూచించారు, ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ పద్మ , ఫెర్టిలైజర్ డీలర్స్ , సింగిల్ విండో సీఈఓ లుపాల్గొన్నారు.

# నెలరోజుల సమ్మర్ క్యాంప్ ఘనంగా ముగింపు..

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు, తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం

ప్రత్యక్ష సాక్షి రామంతపూర్

అమ్మానాన్న జ్ఞాన మందిరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీమతి మణేమ్మ వంశరాజ్ మరియు ఫౌండేషన్ చైర్మన్ ఇరుగజీవ తిరుపతయ్య వంశరాజ్ నాయకత్వంలో గత నెల రోజులుగా రామంతపూర్ వంశరాజ్ సంక్షేమ సంఘం ప్రాంగణంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ఘనంగా మంగళవారం ముగిసింది.

ఈ శిబిరంలో విద్యార్థినీ, విద్యా ర్థుల సమగ్ర వ్యక్తిత్వ వికా సాన్ని లక్ష్యంగా పెట్టుకుని కరాటే, స్పోకెన్ ఇంగ్లీష్, యోగా తదితర అంశాల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్య క్రమానికి సీనియర్ పాత్రి కేయులు పాశం యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, పేద కుటుంబం నుంచి ఎదిగి సమాజ సేవకు అంకితభావంతో పనిచేస్తున్న ఇరుగజీవ తిరుపతయ్య వంశరాజ్ అమ్మానాన్న జ్ఞాన మందిరం ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది పేద విద్యార్థు లకు పాఠ్యపుస్తకాలు అందిం చడంతో పాటు ఉచిత శిక్షణ



తరగతులు నిర్వహించడం అత్యంత అభినందనీయమని కొనియాడారు.

ఈ కార్య క్రమంలో తవిడిపోయిన గిరి బాబు, మురళి గౌడ్, చిటికెల కృష్ణయ్య, రాసని బాల స్వామి, పాయసం గోపాల్, చిన్నకృష్ణ, వెంకటయ్య, చందు, చిటికెల రామకృష్ణ, జి. వీరస్వామి, బాలు, సురేష్, బాలస్వామి, మల్లేష్, నర సింహ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రామ సురేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



ప్రత్యక్ష సాక్షి రంగశాయిపేట

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వరంగల్ మాజీ ఎంపీ రామ సహాయం సురేందర్ రెడ్డి మంగళవారం హన్మకొండకు విచ్చేసిన సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీ. పి సి. సి. డెలిగేట్ మెంబర్ నల్గొండ రమేష్, మాజీ కార్పొరేటర్ బస్వరాజు శిరీష – శ్రీమాన్ హన్మకొండ నగరంలోని అశోక హోటల్లో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు పుష్ప గుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రామ సహాయం సుందర్ రెడ్డి వరంగల్ లో పార్టీ పరిస్థితిని తెలుసుకుని, రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహ్యాలను వరంగల్ తూర్పు నాయకులకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత విస్తరింప చేయాలని సూచించారు, ఈరోజు కార్యక్రమం లో వరంగల్ తూర్పు సీనియర్ నాయకులు గోరంట్ల రాజు మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్ నరిగె శ్రీను, మహిళా నాయకురాళ్లు నారగోని స్వప్న, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే కృష్ణారావు అభివృద్ధి పనుల పరిశీలన..

ఎమ్. లక్ష్మి – ప్రత్యక్ష సాక్షి (కూకట్ పల్లి )

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం కె.పి.హెచ్.బి డివిజన్‌లో కొనసాగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. గతంలో మంజూరైన నిధులతో చేపట్టిన నూతన పైప్‌లైన్లు, రోడ్ల నిర్మాణ పనులు మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కూకట్పల్లి నియోజకవర్గ అభివృద్ధికి వందల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి ప్రజలకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలను అమలు చేశామని తెలిపారు. ముఖ్యంగా కె.పి.హెచ్.బి నాలుగో ఫేజ్‌లో నిరుపేదలు మరియు స్థానిక ప్రజల అవసరాల కోసం అత్యాధునిక సౌకర్యాలతో కమ్యూనిటీ హాల్ నిర్మించామని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కమ్యూనిటీ హాల్‌ను పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. కమ్యూనిటీ హాల్ తాళాలు కాంగ్రెస్ నాయకుల వద్ద ఉండటంతో భవనం చెత్తాచెదారం, బూజులతో నిరుపయోగంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలు తక్కువ ఖర్చుతో శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఈ కమ్యూనిటీ హాల్‌ను



నిర్మించామని, కానీ ప్రస్తుతం ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఆస్తులను సంరక్షించి వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ప్రజా ప్రయోజనాలను కాపాడాలని ఆయన సూచించారు. అభివృద్ధి పనులు ప్రజలకు నేరుగా ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు.

# జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ చందన సుధాకర్

పల్లె సమ్మయ్య ప్రత్యక్ష సాక్షి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిసిన డిసిసి చైర్మన్ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ విభాగం డాక్టర్ చందన సుధాకర్ గన్నేరుల కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మెడికల్ అండ్ హెల్త్ వింగ్ నిర్వహిస్తున్న ప్రజా ఆరోగ్య కార్యక్రమాలు రక్తదాన సేవలు భవిష్యత్ కార్యాచరణ గురించి కలెక్టర్ కు వివరించారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి మెడికల్ అండ్ హెల్త్ వింగ్ తరఫున ఎప్పుడు సంపూర్ణ సహకారం అందిస్తామని వారు తెలియజేశారు.



# జర్మన్ భాషా శిక్షణ ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు

## జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ

పల్లె సమ్మయ్య ప్రత్యక్ష సాక్షి మందమర్రి

మందమర్రి తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్, ఉపాధి శిక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అందిస్తున్న జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు మందమర్రి పట్టణం ఇల్లందు క్లబ్ లో రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద చేతుల మీదుగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని, జర్మనీ తో పాటు ఇతర యూరోపియన్ దేశాలలో ఉపాధి అవకాశాలను పొందేందుకు అవసరమైన భాషా నైపుణ్యాలను అభ్యర్థులకు అందించడం జరుగుతుందని, జర్మన్ భాషలో ప్రాథమిక, మధ్యస్థాయి పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలకు సన్నద్ధం చేయడం జరుగుతుందని విదేశీ ఉపాధి అవకాశాలపై ఆసక్తి కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.



# హెల్ప్ డెస్క్ ఏర్పాటు

(ప్రత్యక్ష సాక్షి, కరీంనగర్)

డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు ఎదుట హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు హెల్ప్ డెస్క్ లో సంప్రదించాలని ప్రజలకు సూచించారు. కలెక్టరేట్ ఏవో సుధాకర్ గృహ నిర్మాణశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సూర్య ఘర్ యోజనతో ఉచిత విద్యుత్, అదనపు ఆదాయం

## రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



(వనపర్తి)

చిన్నంబావి మండల పరిధిలోని పెద్దదగడ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభ లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా గ్రామీణ కుటుంబాలు విద్యుత్ వ్యయాన్ని తగ్గించుకోవడంతో పాటు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని గ్రామస్థులకు తెలియజేశారు. గ్రామంలో ఉన్న 630 కుటుంబాల్లో 469 కుటుంబాలను ఈ పథకానికి అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. అర్హులైన కుటుంబాలు సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ప్రయోజనాలను పొందాలని, సౌర విద్యుత్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గృహ అవసరాలకు వినియోగించు కోవడంతో పాటు, మిగులు విద్యుత్ ను విద్యుత్ సంస్థలకు విక్రయించి అదనపు ఆదాయం పొందవచ్చని మంత్రి జూపల్లి తెలిపారు. ఒక్కో యూనిట్‌కు సుమారు రూ. 2.50 చొప్పున చెల్లింపులు అందే అవకాశం ఉందని, పర్యావరణ పరిరక్షణ తో పాటు కుటుంబాల ఆర్థిక భారం తగ్గించడంలో ఈ పథకం కీలకంగా మారుతుందని మంత్రి పేర్కొన్నారు. గ్రామస్థులు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుని స్వయం విద్యుత్ ఉత్పత్తి దారులుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలోని పాఠశాల ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ రాష్ట్ర డీజీఎం భాస్కర్ రెడ్డి, సర్పంచ్ భాస్కర్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్ర రెడ్డి, మాజీ జడ్పీటీసీ కృష్ణ ప్రసాద్ యాదవ్, సీనియర్ నాయకులు బిచుపల్లి యాదవ్, విద్యుత్ శాఖ అధికారులు, పాల్గొన్నారు.



## మీ పిల్లల్లో ఇమ్యూనిటీ పవర్‌ను పెంచాలంటే

# ఈ ఆహారాలను రోజూ తినిపించండి..!


సీజన్లు మారినప్పుడల్లా సహజంగానే చాలా మందికి దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తుంటాయి. చిన్నారులకు అయితే తరచూ ఈ సమస్యలు వస్తాయి. ఎల్లప్పుడూ వారు జలుబుతో ఇబ్బంది పడుతుంటారు. అయితే వారు తీసుకునే ఆహారంలో మార్పులు చేస్తే దాంతో వారి రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దాని వల్ల వారికి దగ్గు, జలుబు వంటి అనారోగ్య సమస్యలు రాకుండా అడ్డుకట్ట వేయవచ్చు. చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచితే వారికి ఎలాంటి రోగాలు రాకుండా చూడవచచు. అందుకు గాను పలు ఆహారాలను తరచూ ఇవ్వాల్సి ఉంటుంది. వాటితో ఇమ్యూనిటీ పెరగడమే కాదు, వారి శరీరానికి కావల్సిన పోషకాలు, శక్తి కూడా లభిస్తాయి. ఇక చిన్నారుల్లో ఇమ్యూనిటీ పవర్‌ను పెంచే ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

సిట్రస్ పండ్లు..: సిట్రస్ జాతికి చెందిన పండ్లను ఇస్తుంటే చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. నారింజ, నిమ్మ, గ్రేప్ ఫ్రూట్ వంటి పండ్లను వారికి ఇస్తుండాలి. వీటిల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. అలాగే స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్ బెర్రీలను కూడా ఇవ్వవచ్చు. వీటిల్లో విటమిన్ సి తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి పిల్లల్లో ఇమ్యూనిటీని పెంచుతాయి. ఆకుపచ్చని కూరగాయలు లేదా ఆకుకూరలను కూడా పిల్లలకు పెడుతుండాలి. పాలకూర, బ్రోకలీ వంటి కూరగాయల్లో విటమిన్లు ఎ, సి, ఇ, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. చిలగడదుంపలలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఈ ఆహారాలను పిల్లలకు తినిపిస్తే వారిలో రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు.

కోడిగుడ్లు..: కోడిగుడ్లలో ప్రోటీన్లతోపాటు విటమిన్ ఎ, బి12 సెలీనియం అధికంగా ఉంటాయి. జింక్ కూడా పుష్కలంగానే ఉంటుంది. కోడిగుడ్లను రోజుకు ఒకటి చొప్పున పిల్లలకు ఇస్తుండాలి. ఇవి వారిలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. చికెన్, చేపల్లోనూ ప్రోటీన్లు, జింక్ ఎక్కువగానే ఉంటాయి. ఇవి కూడా ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతాయి. తరచూ వీటిని పిల్లలకు ఆహారంలో పెడుతుండాలి. బాదంపప్పు, వాల్ నట్స్ వంటి నట్స్‌తోపాటు చియా సీడ్స్, పొద్దు తిరుగుడు విత్తనాలు వంటి విత్తనాలను కూడా పిల్లలకు పెట్టాలి. వీటిల్లో విటమిన్ ఇ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి చిన్నారుల ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతాయి. రోగాలు రాకుండా చూస్తాయి.

పెరుగు..: పెరుగు మంచి ప్రొ బయోటిక్ ఆహారం. దీన్ని పిల్లలకు రోజూ పెట్టాలి. కొందరు పిల్లలు పెరుగు తినేందుకు ఇష్టపడరు. అలాంటప్పుడు నేరుగా దాన్ని పెట్టకుండా అందులో కాస్త చక్కెర లేదా పండ్ల ముక్కలు కలిపి ఇవ్వాలి. దీంతో వారు పెరుగును ఇష్టంగా తింటారు. పెరుగు జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. ఇది పిల్లల్లో జీర్ణ సమస్యలు రాకుండా చూస్తుంది. వెల్లుల్లి, అల్లం వంటి ఆహారాలను కూడా పిల్లలకు ఇస్తుండాలి. వీటిల్లో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఇలా పలు రకాల ఆహారాలను పిల్లలకు పెట్టడం వల్ల వారిలో ఇమ్యూనిటీ పవర్‌ను పెంచవచ్చు. వారిలో వ్యాధులు రాకుండా చూడవచ్చు. ఆరోగ్యంగా ఉంటారు.

## పుస్తకాలు చదవడం ఆత్మవిశ్వాసాన్ని పెంచే అలవాటు..



పుస్తకాలు చదవడం అనేది మన జీవితంలో అత్యంత ఉపయోగకరమైన అలవాట్లలో ఒకటిగా పరిగణించబడుతుంది. ఇది మన యొక్క వ్యక్తిత్వాన్ని పెంపొందించే, మన ఆలోచనలను విస్తరించే మరియు మన అనుభవాలను పెంచే గొప్ప మార్గం. పుస్తకాలు చదవడం మనకు కేవలం కొత్త సమాచారం మాత్రమే అందించదు, దానితో పాటుగా మనిషి యొక్క ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మొదటిగా, పుస్తకాలు చదవడం మన ఆలోచనా శక్తిని పెంచుతుంది. రకరకాల పుస్తకాలు, పాఠాలు చదవడం మనం ముందుగా ఊహించని కొత్త ఆలోచనలను, దృక్కోణాలను మనలో నింపుతుంది. ఈ మార్పులు మన ఆలోచనల్లో కొత్త దారులు తెరవడమే కాకుండా సమస్యలను పరిష్కరించడంలో సహాయపడతాయి. పుస్తకాలు మనకు విజ్ఞానాన్ని, విద్యను అందిస్తాయి. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకోవడం ద్వారా మన మనస్సును తెరవడానికి, మరియు ప్రస్తుతానికి సరిపడే అభిరుచులను పెంచుకోవడానికి అవకాషం లభిస్తుంది. వ్యక్తిగత అభివృద్ధి కోసం సాహిత్యం, చరిత్ర, విజ్ఞానం, సైన్స్, సాంఘిక శాస్త్రాలు వంటి విభిన్న విభాగాల్లో పుస్తకాలు చదవడం చాలా ముఖ్యమైంది. అలాగే, పుస్తకాలు మన సమయాన్ని సక్రమంగా వినియోగించడానికి సహాయపడతాయి. టీవీ లేదా సోషల్ మీడియా చూస్తున్నప్పుడు మన సమయం వృథా అవుతుంది, కానీ పుస్తకాలు చదవడం ద్వారా మనం కొత్తగా నేర్చుకుంటూ సమయాన్ని సృజనాత్మకంగా ఉపయోగించుకోవచ్చు.

# గ్రీన్‌టీతో డయాబెటిస్ అదుపులో ఉంటుందా..?

## షుగర్ బాధితులంతా ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే..!



డయాబెటిస్ అనేది తీవ్రమైన ఆరోగ్య సమస్యల్లో ఒకటి. ఇది అన్ని వయసుల వారిలో కనిపిస్తుంది. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ డయాబెటిస్‌కి బాధితులుగా మారుతారు. షుగర్ వ్యాధిని అదుపులో ఉంచుకునేందుకు జీవనశైలి, ఆహారం రెండింటినీ మెరుగుపరుచుకోవడం అవసరం. దీన్ని అదుపులో ఉంచుకునేందుకు గ్లైసెమిక్ ఇండెక్స్ 55 కంటే తక్కువ ఉన్న వాటినే తినాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. వీటినే తీసుకుంటే షుగర్ వేగంగా పెరిగే ప్రమాదం ఉండదని పేర్కొంటున్నారు. చక్కెర పెరగకుండా నిరోధించేందుకు క్రమం తప్పకుండా గ్రీన్ టీ తాగడం అలవాటు చేసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుందని పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. గ్రీన్ టీ అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా.. ప్రపంచవ్యాప్తంగా దాని డిమాండ్ పెరిగింది. ఇది అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించే ప్రభావవంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. గ్రీన్ టీ డయాబెటిస్‌కి ఆరోగ్యంపరంగా ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. గ్రీన్ టీ కేవలం రిఫ్రెషర్ పానీయం మాత్రమే కాదని.. వ్యాధుల నుంచి దూరంగా ఉంచడంలో ఇది సహాయపడుతుంది. రక్తంలో షుగర్ లెవల్స్‌ని నియంత్రించేందుకు మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి గ్రీన్ టీ గొప్ప పానీయమని పరిశోధకులు గుర్తించారు. గ్రీన్ టీలో కాటెచిన్ అనే మూలకం ఉంటుంది. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడానికి ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. గ్లూకోజ్‌ను గ్రహించే కణాల సామర్థ్యాన్ని మెరుగుపరచడం ద్వారా రక్తంలో చక్కెరను సమర్థవంతంగా నియంత్రించడంలో ప్రయోజనం పొందొచ్చు. మెడిటేరియన్ డైట్ ప్లాన్‌లో గ్రీన్ టీని చేరిస్తే టైప్-2 డయాబెటిస్‌ని నివారించడంలో సహాయపడుతుందని పరిశోధన చూపిస్తుంది. దీన్ని అలవాట్లు చేసుకున్న వ్యక్తులకు డయాబెటిస్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉన్నది. పరిశోధనలో, గ్రీన్ టీ ఇన్సులిన్ కార్యకలాపాలను పెంచడంలో, ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడంలో సహాయపడుతుందని నిపుణులు గుర్తించారు.

అధ్యయనాల్లో ఏం గుర్తించారంటే..?: కొన్ని అధ్యయనాల ప్రకారం.. ప్రతిరోజూ రెండు నుంచి మూడు కప్పుల గ్రీన్ టీ తాగేవారికి టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 19శాతం తక్కువగా ఉండవచ్చు. ఈ పానీయాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ఉపవాసం సమయంలో రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. ఇది కంటి సమస్యలు, గుండె సమస్యలు, నరాల సమస్యలు వంటి మధుమేహం వల్ల కలిగే ఇతర సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. డయాబెటిస్ నిర్వహణలో బరువు నియంత్రణ కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. జీవక్రియను పెంచడం ద్వారా బరువు తగ్గడంలో గ్రీన్ టీ మీకు సహాయపడుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం కూడా ఎక్కువగా ఉంటుంది. గ్రీన్ టీ తాగడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో, రక్తపోటును సమతుల్యం చేయడంలో కూడా సహాయపడుతుందని అధ్యయనాలు గుర్తించాయి. చెడు కొలెస్ట్రాల్ తగ్గించడంలో, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో ఇది సహాయపడే పానీయమని స్టడీస్ చెబుతున్నాయి. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఓ అధ్యయనం ప్రకారం గ్రీన్ టీ తీసుకోవడం వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని 31శాతం తగ్గించుకోవచ్చు. అయితే, గుండె ఆరోగ్యానికి గ్రీన్ టీ వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకోవడానికి మరిన్ని క్లినికల్ ట్రయల్స్ అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు.

# కొబ్బరినీళ్లకు తోడుగా..



వేసవితాపాన్ని తీర్చడంలో కొబ్బరినీళ్లు ముందుంటాయి. పొటాషియం, మెగ్నీషియం, సోడియంలాంటి ఎలక్ట్రోలైట్లతోపాటు అనేక పోషకాలతో నిండిన ఈ నీళ్లు.. ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంతోపాటు కండరాలు, నరాల పనితీరుకు మద్దతునిస్తాయి. అలాంటి కొబ్బరినీళ్లకు ఇతర పదార్థాలను జోడించడం ద్వారా మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు సమకూరుతాయి.

పుదీనా : కొబ్బరి నీళ్లకు పుదీనాను జోడిస్తే.. అద్భుతమైన రిఫ్రెషింగ్ డ్రింక్ తయారవుతుంది. ఇది శరీరాన్ని చల్లబరచడంతోపాటు జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సమర్థంగా పనిచేస్తుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యను తగ్గిస్తుంది. పుదీనాలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు.. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.

నిమ్మరసం : విటమిన్ సితోపాటు హైడ్రేషన్‌కు మద్దతునిచ్చే ఎంజైమ్‌లు నిమ్మరసంలో పుష్కలంగా ఉంటాయి. ఆమ్ల స్వభావం కలిగిన నిమ్మరసం, ఆల్కలీన్ కొబ్బరినీళ్లతో కలిసి.. శరీర పీహెచ్‌ను సమతుల్యం చేయడంలో సాయపడుతుంది.

తేనె : కొబ్బరినీళ్లకు తేనె కలిపి తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఆయుర్వేదం చెబుతున్నది. తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు, ఎంజైములు, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కొబ్బరినీటిలోని ఖనిజాలతో కలిసి.. ఇన్ఫెక్షన్లతో పోరాడే శక్తిని శరీరానికి అందిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచి ఆరోగ్యానికి అండగా నిలుస్తాయి.

చియా విత్తనాలు : ఫైబర్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభించే చియా విత్తనాలను కొబ్బరినీళ్లలో కలిపితే.. శరీరానికి కావాల్సిన శక్తినిచ్చే పానీయం సిద్ధమవుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. శరీరం ఎక్కువసేపు హైడ్రేటెడ్‌గా ఉండటంలో సహాయపడుతుంది. గుండె, మెదడు ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది.

నల్ల ఉప్పు : కొబ్బరినీళ్లలోని పొటాషియం, మెగ్నీషియం.. నల్ల ఉప్పులోని సోడియం, ఐరన్, సల్ఫర్ వంటి ఖనిజాలు కలిసి.. ఎలక్ట్రోలైట్ రిచ్ డ్రింక్‌గా తయారవుతుంది. నల్ల ఉప్పులోని కార్మినేటివ్ లక్షణాలు.. ఆకలిని నిరోధిస్తాయని ఆయుర్వేదం చెబుతున్నది. ఇవి కొబ్బరినీళ్లతో కలిసినప్పుడు జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

# ఆకలి సరిగ్గా అవడం లేదా.. ఆహారం తినాలనిపించడం లేదా.. అయితే ఈ చిట్కాలను పాటించండి..



**తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే అజీర్తి ఏర్పడుతుంది. దీంతో ఆకలి వేయదు. ఆహారం తక్కువగా తింటారు. ఆకలి తగ్గేందుకు పలు ఇతర కారణాలు కూడా ఉంటాయి. జీర్ణాశయం లో ఎంజైమ్‌లు లేదా జీర్ణ రసాల ఉత్పత్తి తగ్గడం, లివర్ పనితీరు మందగించడం, మలబద్దకం, గ్యాస్ వంటి సమస్యలు ఉండడం వంటి కారణాల వల్ల కూడా ఆకలి ఉండదు. దీంతో ఆహారం సరిగ్గా తినలేకపోతుంటారు. అయితే పలు రకాల చిట్కాలను పాటిస్తే అజీర్తిని తగ్గించి ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేయవచ్చు. దీంతో ఆకలి కూడా పెరుగుతుంది. ఆకలి అసలు లేని వారు కొన్ని చిట్కాలను పాటిస్తే ఎంతో మేలు జరుగుతుంది. ఇక ఆ చిట్కాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.**

**మిరియాలు..:** ఆకలిని పెంచడంలో మిరియాలు అద్భుతంగా పనిచేస్తాయి. మిరియాలను పొడిగా చేసి చిటికెడు మోతాదులో తీసుకుని కాస్త తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం భోజనానికి 30 నిమిషాల ముందు చప్పరించాలి. దీంతో అజీర్తి తగ్గుతుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. మిరియాల పొడిని మజ్జిగలో కలిపి తాగుతున్నా ఉపశమనం లభిస్తుంది. ఆకలి పెరుగుతుంది. మిరియాలలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థలో ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచుతాయి. జీర్ణ రసాలు సక్రమంగా ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దీంతో ఆకలి పెరుగుతుంది. మిరియాలను తేనెతో కలిపి తినడం వల్ల రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే మలబద్దకం తగ్గుతుంది. మిరియాలతో కషాయం తయారు చేసి కూడా తాగవచ్చు.

**అల్లం రసం..:** ఆకలిని పెంచేందుకు అల్లం రసం కూడా ఎంతో పనిచేస్తుంది. ఒక టీస్పూన్ అల్లం రసాన్ని ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు సేవించాలి. అల్లంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవన్నీ పైత్యాన్ని తగ్గిస్తాయి. వికారం, అజీర్తి సమస్యల నుంచి బయట పడేస్తాయి. ఆకలి పెరిగేలా చేస్తాయి. ఆకలి లేని వారు రోజూ అల్లం రసాన్ని తాగుతుంటే ఫలితం ఉంటుంది. అలాగే ఉసిరికాయ జ్యూస్‌ను రోజూ తాగుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఉసిరికాయల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థలో ఉండే ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తాయి. దీంతో అజీర్తి తగ్గి ఆకలి పెరుగుతుంది. రోజూ ఉదయం పరగడుపునే 30 ఎంఎల్ మోతాదులో ఉసిరికాయ జ్యూస్‌ను తాగుతుంటే మంచి ఫలితం ఉంటుంది.

**యాలకులు..:** యాలకులను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. భోజనం చేసిన తరువాత రాత్రి పూట ఒక యాలక్కాయను నేరుగా అలాగే నమిలి తినాలి. ఇది అజీర్తిని తగ్గిస్తుంది. జీర్ణాశయంలో గ్యాస్ ఉత్పత్తిని అరికడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీంతో ఆకలి పెరుగుతుంది. యాలకులను తినడం వల్ల రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. అలాగే నోట్లో ఉండే బ్యాక్టీరియా తగ్గుతుంది. నోటి దుర్వాసన నుంచి ఉపశమనం లభిస్తుంది. యాలక్కాయను రాత్రిపూట తింటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. నిద్ర చక్కగా పడుతుంది. పిప్పిళ్ల చూర్ణం పావు టీస్పూన్ మోతాదులో తీసుకుని దానికి ఒక టీస్పూన్ తేనెను కలిపి రాత్రి పూట నిద్రకు ముందు తీసుకోవాలి. ఈ మిశ్రమం ద్వారా ఆకలి పెరగడమే కాదు, పొట్ట దగ్గరి కొవ్వు కూడా కరుగుతుంది. ఇలా పలు చిట్కాలను పాటిస్తే ఆకలిని పెంచుకోవడమే కాదు, ఇతర ప్రయోజనాలను కూడా పొందవచ్చు.

# దురలవాట్లతో కాలేయ అనారోగ్యం



కాలేయం లేదా లివర్ అనేది శరీర అవయవాల్లో అతి పెద్దది మాత్రమే కాకుండా అత్యంత ప్రధానమైనదిగా వైద్య రంగం వర్గీక రించింది. సక్రమ జీవ వ్యవస్థ కొనసాగింపు, విష పదార్థాలను వడపోసి విసర్జించడం, అత్యవసర జీవ పదార్థాలను తయారు చేయడం, జీర్ణ వ్యవస్థ నుంచి పోషకాలతో నిండిన మంచి రక్తాన్ని తీసుకొని శరీర అవయవాలకు సరఫరా చేయటం లాంటి 500 పైగా విధులను నిర్వహిస్తూ మనకు నిత్య ఆరోగ్య సౌభాగ్యాన్ని కాలేయం అందిస్తున్నది. మన చెడు అలవాట్ల ప్రభావం ప్రత్యక్షంగా కాలేయం మీదనే పడుతుందనే కనీస పరిజ్ఞానర మనకు వుండాలి. లివర్ ఆరోగ్యమే మన ఆరోగ్యమని తలచి జీవనశైలిని మార్చుకోవాలి. ప్రపంచవ్యాప్తం గా దాదాపు 20 లక్షల మంది కాలేయ సంబంధ వ్యాధులతో చనిపోతున్నారని, మరణానికి కారణమైన వ్యాధుల్లో లివర్ వ్యాధులు కూడా ఉన్నాయని తెలుసుకోవాలి. అన్ని వయసుల వారిలో దాదాపు 30 శాతం మందిని కాలేయ సంబంధ రుగ్మతలు వేధిస్తున్నట్లు అంచనా వేస్తున్న వేళ మన కాలేయాన్ని మనమే రక్షించుకోవడం అత్యవసరం.

శరీరానికి శక్తినిచ్చే కేంద్రంగా విలక్షణ విధులను నిర్వహిస్తున్న కాలేయం పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 19 ఏప్రిల్ రోజున "ప్రపంచ కాలేయ దినం" పాటిస్తున్నాం. ఈ ఏడాది ఇతివృత్తంగా "ఆహారమే ఔషధం" అనే అంశాన్ని తీసుకొని విస్తృత ప్రచారం చేస్తున్నారు. మన తీసుకునే ఆహారమే మన లివర్ ఆరోగ్యానికి లేదా అనారోగ్యానికి హేతువుగా మారుతుందని గమనించాలి. ఆల్కహాల్ సేవనం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, స్థూలకాయం, అనవసర ఔషధాల దుష్ప్రభావం, జన్యుపరమైన అంశాలు, దీర్ఘకాలిక అనారోగ్యాల కారక జీవనశైలి లాంటి అంశాలు కాలేయ అనారోగ్యానికి హేతువులు. దురలవాట్లు పెరిగి పెరిగి ఫ్యాటీ లివర్, హెపటైటిస్ (కామెర్లు), లివర్ ఫెయిల్యూర్, లివర్ క్యాన్సర్, లివర్ సిర్రోసిస్ లాంటి ప్రాణాంతక కాలేయ అనారోగ్యాలు కలుగుతాయి. చెడు అలవాట్లు మితిమీరి చర్మం/కళ్లు పసుపు పచ్చగా మారడం, కడుపు నొప్పి లేదా వాపు రావడం, అకారణంగా బరువు తగ్గడం, ఆకలి మందగించడం, మూత్రం ముదురు పసుపు రంగులోకి మారడం, చర్మ దురద లాంటి పలు రోగ లక్షణాలు కనిపిస్తాయి. మన జీవనశైలిలో పలు మార్పులు చేసుకొన్నపుడు మన కాలేయం ఉత్తేజితమౌతుంది. ఆరోగ్యం సమకూరుతుంది. నిత్యం శారీరక వ్యాయామం, శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, ఆల్కహాల్ సేవన దురలవాటుకు దూరంగా ఉండడం, విష పదార్థాలకు ఎక్స్‌పోజ్ కాకుండా ఉండడం లాంటి అంశాలు మన కాలేయ ఆరోగ్యానికి పునాదులుగా మారతాయి. సమతుల పోషకాహారం తీసుకోవడంతో లివర్ సంబంధ అనారోగ్యాలైన కాలేయ వాపు, కాలేయ రుగ్మతలు పూర్తిగా పలుచబడి మానవ శ్రేయస్సుకు ఊతం ఇస్తాయి.

